కథ

# తల్లి కాని తల్లి

- అనంత వేంకటేశన్

శ్రావణిని ఒంటరితనం ఆ ఇంట్లో వెర్రిదాన్ని చేసి ఆడిస్తోంది! ఆ కొత్త ఇంటికి, ఆ కొత్త మనుషుల మధ్యకు వచ్చి మూడు మాసాలు కావస్తోంది. కానీ, మూడు మన్వంతరాల ఏకాంతం మూటకట్టుకుంది. తను ఎం.ఎస్‌సి,. అన్ని పరిస్థితులు సవ్యంగా ఉంటే గృహిణిగా... అందునా ఉత్తమ గృహిణిగా గోల్డ్ మెడల్ పొందాలని ఆశయం.

కాలం తనకు మాత్రం నెమ్మదిగా నడుస్తోంది కనుక తనను వరించే ఎన్నో ఉద్యోగాలలో ఒకదాన్ని ముడేసుకుని, పరుగులు తీయాలని లేదామెకు.

అక్కడికీ... దేవుడు ఉన్నాడో లేడో ఇంకా ఒక నిర్ధారణకు రాకుండానే జీవితంలో ఒక విధమైన క్రమశిక్షణ, ప్రశాంతత కోసం పూజా కార్యక్రమం నిర్వహిస్తోంది.

తన ఆశ - భర్త ఆఫీసుకు వెళ్ళేవరకు అంటిపెట్టుకుని అన్ని అవసరాలు చూడాలని.... చివరికి బూట్లు తొడిగి లేసులు కూడా తనే కట్టి సాగనంపాలని.

కానీ ప్రకృతి ఆయనలో వ్యతిరేకంగా ప్రవేశించి, భార్య మగాడి బానిస కాదు, వ్యక్తిగతమైన పనులు భార్యతో చేయించుకోకూడదులాంటి భావాల్ని పెంచింది.

అవి బలవంతాన చేయించుకుంటే బానిసత్వమవుతుంది కానీ ఇష్టంగా చేసేవి భర్తపై భార్యకుగల అనురాగాన్ని తెలపడానికి ఆ సన్నివేశాలు మాధ్యమం అవుతాయని భర్తకు తెలియజేయడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదామె. కారణం - భర్తలో అంతటి ఈస్తటిక్ సెన్స్ వుందో లేదోనని!

వీటన్నింటికంటే ఆమెను ఎక్కువగా బాధించేది ఆ ఇంట్లోని ఇద్దరు మగాళ్ళు బయటికెళ్ళిపోయాక తనతో ఉన్న మరో స్త్రీ తనతో కలవకపోవడమే! ఆమె తన తోడికోడలు ధనలక్ష్మి.

✲ ✲ ✲

"ఏవండి!" రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి చేరిన సుదర్శన్ కోటు గుండీలు తీసుకోబోతుంటే వెళ్ళి గుండెల మీద వాలి అన్నది శ్రావణి.

"ఏంటండీ?!" అల్లరిగా అడిగాడు సుదర్శన్.

ఒళ్ళు పులకించిందామెకు.

"ఏమిటి!?" మరింతగా ఎదకు హత్తుకున్నాడు.

"సరే, ఏదో చెప్పబోతే నేనేదో చేసినట్లున్నాను! ఏమిటి?"

"అదేనండి... ఒంటరితనం...."

"అదేమిటి! చలం, బుచ్చిబాబు, కొడవటిగంటి, సంజీవదేవ్, మాలతీచందూర్, అమృతాప్రీతమ్... ఇలా ఎందర్నో తెచ్చిపెట్టుకున్నావ్‌గా షెల్ఫ్‌లో! వాళ్ళెవరూ కబుర్లు చెప్పడం లేదా?"

"ఎంతైనా కాల్పనికతయేగా! అది కొంతవరకే ఊరట కలిగిస్తుంది. సజీవమైన ఉనికి, స్పందన, ఆర్ద్రత.. ఇలాంటి వాటితో అనుభూతించాలని మనసు ఆరాటం!"

'అయితే ఒక నూతన ప్రాణిని సృష్టించు!" కొంటెగా బుగ్గమీటుతూ అన్నాడు.

'ఈ ఇంట్లో ఉండగానా?' అనబోయింది.

"చిన్నా!" అని హాల్లోంచి బావగారి పిలుపు.

"వస్తున్నా నన్నయ్యా" కోటు సవరించుకుంటూ గది బయటికెళ్ళి పోయాడు సుదర్శన్.

నిట్టూర్చి పరుపుపై కూలబడింది శ్రావణి.

✲ ✲ ✲

కాలింగ్‌బెల్ మోతవిని ధనలక్ష్మి వచ్చి తలుపు తెరచింది. కాస్త వెనకగా శ్రావణి కూడా వచ్చింది.

ఒక ముప్పై ఏళ్ళ మహిళ ఆప్యాయంగా ధనలక్ష్మిని కౌగిలించుకుని, "అక్కా! బావున్నావా?" అని పలకరించింది.

సవ్వడి లేకుండా నవ్వి, "ఎప్పుడొచ్చావు దాక్షాయణి?" అంది ధనలక్ష్మి

"ఈ రోజే!" అంటూ ప్రశ్నార్థకంగా, తన అంచనా నిజమేనా అన్నట్లు శ్రావణి వంక చూసింది.

ప్రతిమలా నిలబడి చూస్తున్న శ్రావణిని పిలిచి, "ఈమె మన పక్కింటి వాళ్లమ్మాయి. నాలుగైదేళ్ళ క్రితం పెళ్ళయింది. పెళ్ళికి ముందు ఇంచుమించుగా మనింట్లోనే గడిపేది. ప్రస్తుతం భర్త, బాబుతో విశాఖలో ఉంటోంది" అని శ్రావణిని ఆమెకు పరిచయం చేసింది.

ముగ్గురూ సోఫాల్లో కూర్చున్నారు.

"ఏమిటి విశేషం! పట్టుచీర కట్టావు, చేతిలోకుంకుమ భరిణిలా ఉంది?" అడిగింది ధనలక్ష్మి.

"చెల్లి గాయత్రి సీమంతం. ఇంట్లో ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. చుట్టుపక్కల తెలిసిన వాళ్ళను కలిసి నట్లుంటుందని పేరంటం పిలవడానికి నేను బయలుదేరాను..." గలగలా మాట్లాడేస్తోంది దాక్షాయణి.

ధనలక్ష్మి ముఖంలో రంగులు మారడాన్ని ఇద్దరూ గమనించారు.

అయితే అది అసూయతో కాదు, ఇన్‌ఫీరియర్‌గా ఫీలవుతోందని అర్థం చేసుకుంది దాక్షాయణి.

"కాస్త కాఫీ కలుపుకొస్తాను" అటూ లేచింది ధనలక్ష్మి

తన కాంప్లెక్స్ దాచుకోలేక వెళ్ళింది అనిపించింది ఇద్దరికీను.

"చాలా మారిపోయింది అక్క!" విచారంగా అంది దాక్షాయణి.

"అంటే! ఇంతకు పూర్వం ఇలా ఉండేవారు కాదా?" ఆశ్చర్యంగా అడిగింది శ్రావణి.

"ఇలాగా! ... కాదు. విరబూసిన తంగేడు చెట్టు, గలగలా పారే గోదారి అంటారే అలా ఉండేది. సుమారు పదేళ్ళ క్రితం ఈ ఇల్లు కొనుక్కుని వచ్చారు. అప్పుడు అక్క కూడా మీలాగే ఈ ఇంటికి కొత్త కోడలు. నేను డిగ్రీ చదువుతున్నానప్పుడు. అక్క నాకంటే ఐదారేళ్ళు పెద్దది. అయినా మాకు స్నేహం బాగా కలిసింది. అప్పుడు జితేంద్ర, సుదర్శనం బావలిద్దరూ రియల్ ఎస్టేట్ అని, ఇంకా ఏవేవో బిజినెస్ వ్యవహారాల్లో తెగ తిరుగుతుండే వాళ్ళు. ఇంక మేమిద్దరం సినిమాలు, షికార్లు... ఓహో! ఎంత జాలీలైఫ్! మళ్ళీ అలాంటి రోజులు రావు. నాలుగైదేళ్లు కాలం తెలియకుండా గడిచిపోయింది. ఆ తరువాత నుంచే - తనకు పిల్లలు కలగడంలేదన్న బాధ అక్కకు. ఎందరో డాక్టర్లని, దేవుళ్ళని, వ్రతాల్ని ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఈ లోపు నాకు పెళ్ళై వెళ్ళిపోయాను. ఇంక అక్కకు తన బాధే నిరంతరం ఆలోచనై కూర్చుంది. అప్పుడప్పుడు వచ్చినప్పుడు అమ్మావాళ్ళు చెప్పేవాళ్ళు - అసలు బయటకు రావడమే మానేసిందని. నేనూ ఎంతగానో చెప్పి చూశాను. కానీ లాభం లేకపోయింది. ఇప్పుడు మిమ్మల్ని చూస్తుంటే మళ్ళీ ఆశకలుగుతోంది. అతి చనువు తీసుకుంటున్నానని మీరు అనుకోకపోతే... తోడి కోడళ్ళంటే సరిపడకుండా ఉండాలనుకుంటే నేను చెప్పలేనుగానీ, లేకుంటే ఆమె మీకు తోబుట్టువే అవుతుంది..."

కాఫీ కప్పులతో వచ్చింది ధనలక్ష్మి


"ఏమిటక్కా! చిన్నక్కను కూడా ఇంటెడు పనికి అలవాటు చేశావా?" నవ్వుతూ కప్పు అందుకుంటూ అంది దాక్షాయణి.

"లేదు దాక్షాయణి! శ్రావణికి కూడా ఇంటిపని స్వయంగా చేసుకోవడం ఇష్టం. అందుకే పనివాళ్లెవరూ ప్రవేశించలేదు ఇంట్లోకి" నవ్వుతూనే జవాబిచ్చింది ధనలక్ష్మి

ఇద్దరికీ బొట్టుపెట్టి, తప్పక రమ్మని మరీ చెప్పి చాలా ఆలస్యమయిపోయిందనుకుంటూ హడావుడిగా వెళ్ళిపోయింది దాక్షాయణి.

'మా వదిన నిజంగా దేవత. మాతృత్వం మీద తీవ్ర మమకారం తీరక అలా అయిపోయింది కానీ...' అని అప్పుడప్పుడు భర్త చెప్పిన మాటలను బట్టే చూస్తే, తనతోడి కోడలి మీద తనకు ఇంతవరకు సానుభూతి కలగనందుకు తన సంస్కారం మీద తనకే సిగ్గుగా అనిపించింది.

సాయంత్రం పేరంటానికెళ్ళడానికి ధనలక్ష్మిని కదిపింది శ్రావణి. తలనొప్పిగా ఉంది నువ్వెళ్ళి రామ్మా అంటూ తప్పించుకుంది. పరిస్థితి మరికాస్త లోతుగా తెలిసిన తరువాత బలవంత పెట్టదలచుకోక తనే వెళ్ళింది శ్రావణి.



దాక్షాయణి అక్కడ ఉన్న రెండురోజులు, ధనలక్ష్మి యొక్క గొప్ప వ్యక్తిత్వం గురించి అనేక విషయాలు తెలుసుకుంది. ఇప్పుడు తనొక నిర్ణయానికి వచ్చింది శ్రావణి.

✲ ✲ ✲

ఆదివారం సినిమాకి తయారయ్యారు శ్రావణి, సుదర్శన్. ధనలక్ష్మి రాదని తెలిసినా అడిగింది శ్రావణి. రాలేనంది ధనలక్ష్మి

అంతవరకు ఇంట్లోనే ఉన్న జితేంద్ర ఎక్కడికో అప్పుడే బయటికెళ్ళాడు. చీకట్లు ముసురుకుంటున్నా రాలేదు.

"మీ రిద్దరూ వెళ్ళీరండి, టైమైపోతోంది" అని పదే పదే అంది ధనలక్ష్మి. కదల్లేదు సుదర్శన్.

ఏడున్నర అవుతుండగా వచ్చిన జితేంద్ర విషయం తెలుసుకుని చాలా నొచ్చుకున్నాడు.

"ఏం పనిరా ఇది చిన్నా! పెళ్ళాం వచ్చినా కూడా నా పర్మిషన్ ఏమిటి?" మందలించాడు.

"పర్మిషన్ కాదన్నయ్యా! నువ్వు కూడా వస్తావని..." నసిగాడు.

అది అబద్ధమని అక్కడ అందరి అంతరంగాలకు తెలుసు.

తమ్ముడు తనపట్ల చూపిన గౌరవం ఎంత ఆనం దాన్ని కలిగించిందో అంత బాధ కూడా కలిగిం చింది.

"ఏమ్మా శ్రావణీ! మా తమ్ముడు ఎలాగో దద్దోజనం అనుకో, నువ్వన్నా వాణ్ణి కొంగుకు కట్టేసుకోవద్దూ!" నవ్వుతూ అన్నాడు.

"పో అన్నయ్యా! పరువు తీస్తున్నావ్!" సిగ్గుపడ్డాడు సుదర్శన్.

అంతే సిగ్గుతో లోనికి పారిపోయింది శ్రావణి.

"శ్రావణీ! నువ్వే మైనా ఫీలైతే క్షమించు. ఏవిటో! అన్నయ్యకు చెప్పకుండా రాలేకపోయాను" మన్నింపుగా అడిగాడు సుదర్శన్.

"ఛ! ఛ! అలాంటిదేమీ లేదు"

భార్యను దగ్గరకు తీసుకుని, "ఊహ తెలియక ముందే అమ్మా నాన్నా పోయాక అన్నీ తనే అయి పెంచాడు, చదివించాడు అన్నయ్య. చాలా కష్టాలు పడ్డాడు. చిన్నా చితక పనుల్నుంచి ఈనాడు ఈ బిజినెస్ స్థాయికి ఎదిగాం. నేను వేరే ఉద్యోగానికి ప్రయత్నించకుండా అన్నయ్యకు తోడుగా ఉండిపోయాను. అన్నయ్య ఏదీ శాసించడు. అందుకో ఏమో నాకు చాలా గౌరవం! అందుకే ఏ చిన్న విషయం స్వతంత్రించాలన్నా ఇబ్బందిగా ఉంటుంది" చాలా గంభీరంగా చెప్పాడు.

"నాకు తెలియదా ఏమిటి? నా కెందుకింత వివరణ? మీ రెప్పుడూ ఇలా రామలక్ష్మణుల్లా ఉండాలనే నేనూ కోరుకునేది."

"శ్రావణీ! నిజంగా మా వదినతో సరిపోల్చదగిన ఇల్లాలివి!" మమైకంగా హత్తుకున్నాడు.

అనేక సంఘటనల ద్వారా ఆ ఇంట్లో మిగిలిన

ముగ్గుర్నీ అర్ధం చేసుకోసాగింది. అదే ఇంతకు పూర్వమైతే... ఛ! ఎంత హీనంగా ఆలోచించేది- వీళ్ళా అందరిలాంటి వాళ్ళని! చిన్నప్పటి నుండీ అనేకమందిని గమనించి, మెట్టినింట్లో మంచిపేరు సంపాదించుకోవాలని కలలు గనేది. కానీ, తోడికోడలు కలవదని... ఈయన అన్న గీత గియ్యకుండానే తనే గీసుకుని దాటరని... వీళ్ళ మధ్యన ఎక్కువ కాలం ఉండలేదని, వేరు కాపురం పెడితే బావుంటుందని... ఇంకానయం! తన కుసంస్కారపు ఆలోచనలు ఎప్పుడూ భర్త ముందు పెట్టలేదు! చాలాసార్లు నోరు జారబోయింది. అయినా దైవం మేలు చేశాడు.

"శ్రావణీ! నిద్రపోయావా?" ఆమెను కదుపుతూ అడిగాడు సుదర్శన్.

"లేదు. చెప్పండి."

"వదిన్ని మళ్ళీ పూర్వపు మనిషిని చేసే శక్తి నీకే వుంది."

"తప్పకుండా ప్రయత్నిస్తాను. అయితే నాకు ఉత్తమంగా తోచిన నిర్ణయాలు తీసుకుం టాను. వాటిని మీరు ఆమోదించాలి!"

"నా భార్య ఏమి చేసినా నలుగురి మంచికే చేస్తుందని పూర్తిగా నమ్ముతాను" విశ్వాసంగా అన్నాడు.

"ఆ నమ్మకం చాలు నాకీ జన్మకి" అంటూ అతణ్ణి హత్తుకుపోయింది.

* * *

తను కడుపుతో ఉన్నట్లు పుట్టింటి వాళ్ళకు తెలియకుండా జాగ్రత్తపడింది శ్రావణి. ఏ సంబరాలు చేయించుకోలేదు. ఎవ్వరు చెప్పినా వినలేదు. ఆమెకేదో ఆలోచన ఉండి ఉంటుందని భర్త అంతగా ఒత్తిడి చేయలేదు.

ఒకానొక శుభదినాన మగశిశువుని సుఖంగా ప్రసవించింది శ్రావణి. అందరికీ ఆరోజు పండుగ.

వాడికి సరిపడా పాలు శ్రావణి వద్ద లేకపోవడంతో పోతపాలు తప్పనిసరి అయ్యాయి. బాబు అవసరాల్ని కావాలనే ఎక్కువగా ధనలక్ష్మి మీదకే వదిలేది. ఆ తరువాత నెమ్మదిగా బాబుని ఇంచుమించు పట్టించుకోవడం మానేసింది. పగలు బాబు నిద్రలేచే సమయాలు, ఏడ్చే అవసరాలు గమనించి, ఆ టైమ్‌లో స్నానానికి వెళ్ళడమో, మిక్సీలోంచి ఏదో పిండి తీస్తూ చేతులు ఖాళీగా ఉంచుకోక పోడడమో.... ఇలా అనేకం చేయసాగింది శ్రావణి.

ఇంక తప్పక ధనలక్ష్మికి బాగా మాలిమి అయ్యాడు పిల్లాడు. ఆమెలో నెమ్మదిగా మార్పు రాసాగింది. శ్రావణి ఉద్దేశం ఏమాత్రం పసిగట్టలేకపోయింది. ఎక్కువగా బాబు ఆమె చేతి స్పర్శకే అలవాటు పడ్డాడేమో, శ్రావణి ఎత్తుకుంటే ఏడ్చేవాడు. "అక్కా! కాస్త చూడండి! వీడు ఏడుపు ఆపడంలేదు" అన్నప్పుడు ఆమె ఎత్తుకోగానే ఏడుపు ఆపేవాడు. ఇంక ధనలక్ష్మి మురిపానికి, గర్వానికి అంతులేకుండా పోయేది. ఆమె ముఖంలోని ఆ వెలుగు చూస్తూ తృప్తిగా నిట్టూర్చేది శ్రావణి.

బాబుకి, ధనలక్ష్మిని, జితేంద్రని మమ్మీ డాడీ అని పిలిచేలా అలవాటు చేసింది శ్రావణి.

"మరి నువ్వో?" అన్నాడొకనాడు ఆ పసివాడు.

నవ్వి "నేను చిన్నమ్మను" అంది.

ఈ పిలుపులు బయటకు వినిపించాక శ్రావణిని నిలేసింది ధనలక్ష్మి

"ఏమీ లేదులే అక్కా! నేను సంతోషంగా చేసేది చెయ్యనివ్వండి" అని తేల్చి పారేసింది శ్రావణి.

'మాతృత్వ మధురిమను వదులుకోవడం అంత తేలిక కాదు! ఇది ఎంతవరకు ప్రయాణిస్తుందో భవిష్యత్తులో! అప్పుడు తన పరిస్థితి, శ్రావణి పరిస్థితి ఏమిటి?' ఆలోచనకు పరిష్కారం దొరకలేదు ధనలక్ష్మికి.

అది ప్రకృతే పరిష్కరించింది. శ్రావణి మళ్ళీ గర్భవతి అయింది.

* * *

ఈసారి కాన్పు కష్టమైంది శ్రావణికి, ఆడపిల్ల, ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. మరోసారి గర్భం కష్టమని, సుదర్శన్ అనుమతితో ఫ్యామిలీప్లానింగ్ ఆపరేషన్ చేశారు డాక్టర్లు.

చాలా బలహీనంగా ఉండడం వల్ల మూడు నెలల వరకు మంచం దిగలేకపోయింది శ్రావణి. శ్రావణి తల్లి వచ్చి, పనంతా ధనలక్ష్మే చూసుకోవడం వల్ల కూతురి పట్ల దిగులు లేకుండా పది రోజుల్లోనే వెళ్ళిపోయింది.

పాపను లాలించాలని ఎంతగానో ఉవ్విళ్ళూరేది శ్రావణి. కానీ ఓపికుండేది కాదు. అడిగిన ప్రతిసారీ ధనలక్ష్మి పాపను శ్రావణి దగ్గర పడుకోబెట్టేది. కానీ గుక్కపట్టి ఏడ్చేది పాప. చేసేది లేక ధనలక్ష్మే సముదాయించేది.

శ్రావణి చాలా బలం పుంజుకునేసరికి సంవత్సరకాలం పట్టింది. తనదనుకున్న పాప ఈలోగా ధనలక్ష్మికే మాలిమైపోయింది. తన పాపను దగ్గర చేసుకోవాలని ఎంత గానో ప్రయత్నించింది శ్రావణి. కానీ అన్న నడిచిన దారి లోనే నడవసాగింది పాప. తనూహించిందొకటి, జరుగుతున్నది మరొకటి. తట్టుకోవడం కష్టమవసాగింది శ్రావణికి.

ఇంట్లో తినడానికి ఎన్ని ఉన్నా, బయటిషాపులో కొనుక్కుతింటే గానీ పిల్లలకు ఆనందంగా ఉండదు. ఆరోజు సాయంత్రం పిల్లలు బబుల్‌గమ్, లాలీపాప్ కావాలంటూ మారాం చేశారు. పిల్లల్ని తీసుకుని సెంటర్‌కి వెళ్ళింది ధనలక్ష్మి

తలుపులన్నీ వేసుకుని బావురమని ఏడ్చింది శ్రావణి. కొంత సేపటికి అంతరాత్మే ఆమెని ఊరడించింది. 'నువ్వూహించినట్లే జరగాలని ఎక్కడుంది? నీకు తెలుసుగా ప్రకృతి వ్యతిరేకంగా ప్రయాణిస్తుందని,. మనిషి తన కోరికనే దీపాన్ని దేవుడి ముందుంచుతాడు. ఆ దీపం తాలూకు క్రీనీడని మర్చిపోతాడు. ఆ కోరికలోని తప్పని అపసవ్యతే క్రీనీడ. అది ఎవరైనా భరించాల్సిందే.' ఈ ఫిలాసఫీని జీర్ణించుకోవాలని ప్రయత్నించసాగింది.

* * *

కొద్దికాలంగా శ్రావణిని గమనిస్తున్న ధనలక్ష్మి ఒకనాడు, "అమ్మా శ్రావణీ! బిజినెస్ పెరిగిందని మీ బావగారు ఒక బ్రాంచి హైదరాబాద్‌లో ఓపెన్ చేయడం నీకు తెలిసిందేగా! వారానికి ఒకటి రెండు సార్లు తిరుగుతూ ఆయన అవస్థపడుతున్నారు.

నేను కూడా తోడుగా అక్కడే ఉంటే బావుంటుం దనుకుంటున్నాను. ఇక్కడ బిజినెస్ చూడడానికి సుదర్శన్ ఎలాగూ ఉన్నాడు కదా!" అంది. దిగ్భ్రాంతి చెందింది శ్రావణి. "అదే మిటి! మీరెళ్ళిపోతే బిక్కుబిక్కు మంటూ నేనెలా ఉండ గలను?" కంగా రుగా అడి గింది.

"ఇందులో దిగులేముంది. రోజస్తమానం సుదర్శన్, పిల్లల పనులే సరిపోతాయి నీకు" చాలా క్యాజుల్‌గా అంది.

ఈసారి ఆశ్చర్యం మరింత రెట్టింపయింది శ్రావణికి.

"అంటే, పిల్లల్ని ఇక్కడే వదిలేస్తారా?"

నవ్వి, "అదేమిటమ్మా! నీ పిల్లలు నీ దగ్గరకాక ఎక్కడుంటారు?" అంది.

"నా పిల్లలా!?... కాదు, వాళ్ళు మీ పిల్లలే!"

"కాదు వాళ్ళు నీ పిల్లలే కావాలి! మాతృత్వం మధురిమని చవిచూడని నాకు ఈ జన్మకి చాలినంత అందించావు. ఆ తృప్తితో నేను ఎక్కడైనా సంతోషంగా జీవించగలను. తల్లికాని నన్ను తల్లిని చేశావు. తల్లివైన నువ్వు తల్లివి కాకుండాపోవడం నేను భరించలేను.

ఆ బాధ ఎంతటిదో నాకు తెలుసు. అదే బాధను తిరిగి నువ్వు అనుభవించడం నేను తట్టుకోలేను. దయచేసి నన్ను వెళ్ళనియ్యి."

"అక్కా! మీరు వెళ్ళడానికి వీల్లేదు. వీళ్ళు మనిద్దరి పిల్లలు" అంటూ తన్నుకొస్తున్న ఉద్వేగ్నతను అణచుకోలేక ధనలక్ష్మిని కౌగిలించుకుని బావురుమని ఏడ్చింది శ్రావణి. అంతవరకు గంభీరంగా ఉన్న ధనలక్ష్మి "చెల్లీ!" అంటూ శ్రావణిని గుండెలకు ఆర్ద్రతగా హత్తుకుంది. వారి కౌగిలింతలో అంతులేని ఆప్యాయత ప్రవహిం చసాగింది.

ఆ ఉత్తమ మానవత్వాన్ని ఇంకా ఈ ప్రపంచపు మాయ జాలతారుతో కప్పబడని ఆ బాలల బాల్యం అర్ధంకానట్లు చూసింది. ☐

### కూరలు నూనెలోనే ఎందుకు వేయించాలి?

సాధారణంగా కూరలను నూనెలతో వేయిస్తూంటాం అంతే కానీ నీటిలో ఉడకబెట్టడమే తప్ప కూరలను వేయించడం సాధ్యపడదు. నూనెకు ఈ ప్రత్యేకమైన లక్షణం ఎలా వచ్చింది? వేడి చేసినపుడు నూనె కంటే నీరు త్వరగా ఆవిరి అవుతుంది. అందువల్లనే నీటితో కూరలను వేయించడానికి సాధ్యపడదు. కాయగూరలలో నీరు అధిక శాతంలో వుంటుంది. ఈ నీటిని వెలికి పంపేందుకే మనం కాయగూరలను వేయించుతుంటాం. ఇందుకు నీరు ఆవిరిగా మారే పాయింట్ 100°c కంటే అధికమైన వేడిమితో కాయగూరలను వేడి చేస్తూంటాం. ఒకవేళ కూరలను వేయించడానికి నీటిని ఉపయోగిస్తే, అవి వేగక ముందే వేయించడానికి మనం ఉపయోగించిన నీరు ఆవిరైపోతుంది. అదే సమయంలో నూనెతో ఆహార పదార్థాలను వేయించాలంటే, ఆ నూనెను సుమారు 150°c కంటే అధికమైన వేడిమిని ఉపయోగించాల్సి వుంటుంది. ఈ వేడిమితో నూనె త్వరగా ఆవిరి కాకుండా కూరలు చక్కగా వేగడానికి దోహదపడుతుంది.